సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 13 | ఆగస్టు | 2023



కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను వదిలారు.



అన్నదానం ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు విలుమూరి రామకృష్ణ దంపతులు శనివారం రూ.10 వేల విరాళం సమర్పించారు.

తను కనుమరుగై.. పదుగురికి ప్రాణదీపమై..



మనిషి మరణించినా తిరిగి మరొకరిలో బతకడం ఒక్క అవయవ దానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. వివిధ కారణాలతో కీలక అవయవాలు చెడిపోయి మృత్యువు అంచుకు చేరుతున్న వారికి అవయవ దానం సంజీవనిగా నిలుస్తోంది. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం.

8లో

న్యూస్‌రీల్

వాడపల్లిలో కోనేటి అభివృద్ధికి రూ.2.80 కోట్లు



ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో తిరుమలలోని స్వామి పుష్కరిణి మాదిరిగా.. కోనేటిని అభివృద్ధి చేయనున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2.80 కోట్ల కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసింది. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఆలయ రూపురేఖలు సమూలంగా మారాయని, సుమారు రూ.4 కోట్లతో ప్రాకార మండపాలు నిర్మించామని చెప్పారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ నిధులతో ఆలయం చుట్టూ ప్రాంగణాలు, విద్యుద్దీపాలంకరణ చేశారన్నారు. ఆలయం లోపల ఫ్లోరింగ్ సమూలంగా మార్చామని చెప్పారు. నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న పలు దేవాలయాలకు కూడా సీజీఎఫ్ గ్రాంట్ విడుదల చేయించి, నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. మరికొన్ని దేవాలయాల పునర్నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి 17 బీచ్‌ల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

సాక్షి, అమలాపురం: జిల్లాలో పర్యాటకాభివృద్ధికి 17 బీచ్‌లను ఎంపిక చేశామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ప్రజాప్రతినిధులు, పర్యాటక, పంచాయతీ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలకు లోబడి జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అవకాశం బీచ్‌లపై చర్చించారు. సీఆర్‌జెడ్ నిబంధనలకు లోబడి జిల్లాలో 17 బీచ్‌లు అభివృద్ధికి అనువుగా ఉన్నాయని ఏపీ టూరిజం కార్పొరేషన్ ఈడీ వి.స్వామినాయుడు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కేశనపల్లి, పడమటిపాలెం, చింతలమోరి నేచురల్, కేసుదాసుపాలెం, ప్యారడైజ్, సెయింట్ మేరీ పాఠశాల రోడ్డు, అంతర్వేది-1 (పల్లిపాలెం), అంతర్వేది-2 (దేవస్థానం), పల్లం, చిర్రయానం, ఎస్.యానాం, వాసాలతిప్ప, ఓడలరేవు, తూర్పుపాలెంతో పాటు పలు బీచ్‌లను గుర్తించామని తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ, బీచ్‌ల వద్ద టూరిజం పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలను ప్రణాళికలో చేర్చాలని సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలు, ప్రజాప్రతినిధుల సూచనలతో ఏపీ టూరిజం అథారిటీ సీఈఓకు నివేదిక పంపుతామని ఈడీ స్వామినాయుడు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ పిల్లి డేవిడ్‌రాజు, పర్యాటక శాఖ డీఈ పవన్‌కుమార్, ఈఈ రాజారావు పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్సైల బదిలీ

అమలాపురం టౌన్: ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మామిడికుదురు మండలం నగరం ఎస్సైగా పని చేస్తున్న జానీబాషా పామర్రుకు బదిలీ అయ్యారు. రాయవరం ఎస్సై సురేష్‌ను నగరం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. గతంలో అమలాపురంలో పని చేసి వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో ఉన్న నరేష్ రాయవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.



ఎద్దు పోయే.. యంత్రమొచ్చె..

ఏమి ఆయిలే ఇలా..

- చాన్నాళ్లకు వంటిల్లు చేరుతున్న గానుగ నూనె
- కరోనా తర్వాత పెరిగిన ఈ ఆయిల్ వాడకం
- ఆరోగ్య స్పృహతో మారిన జీవనశైలి
- రసాయన నూనెతో ఆరోగ్యానికి ముప్పు

(డెస్క్–రాజమహేంద్రవరం): రిఫైన్డ్ ఆయిల్ మంచిదని ఒకరు.. డబుల్ రిఫైన్డ్ ఆయిల్ మంచిదని మరొకరు అంటారు. ఇలా ఎవరికి తోచింది వారు చెబుతూంటారు. ఇప్పుడు వాటన్నింటినీ సంప్రదాయ గానుగ నూనెలు (కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్) పక్కకు తోసేశాయి. ఆరోగ్య రక్షణలో తమకు సాటి మరొకటి లేదంటున్నాయి. గతంలో వంటలకు గానుగ నూనెనే వాడేవారు. అనారోగ్య బాధితులకు.. బాలింతలకు దీంతో చేసిన వంటకాలనే పెట్టేవారు. కాలక్రమంలో రిఫైన్డ్ అంటూ ఆయిల్ కంపెనీలు ప్రవేశించాయి. ఈ ప్రభావం గానుగ నూనెపై పడింది. ఫలితంగా ఇది క్రమంగా ఉనికి కోల్పోయింది. కరోనా తర్వాత ఆరోగ్య స్పృహ పెరగడంతో జనం దృష్టి మళ్లీ గానుగ నూనెపై మళ్లింది.



రాజమహేంద్రవరంలో గానుగ నూనె విక్రయాలు

మార్కెటింగ్ మ్యాజిక్కే..

రిఫైన్డ్ ఆయిల్ అంటే శుద్ధి చేసిన నూనె. కానీ ఈ నూనె తయారీకి పూర్తిగా గింజలను వాడతారనే నమ్మకం లేదు. పెట్రోలియం బై ప్రొడక్టు అయిన పాలిమర్ ఆయిల్ నుంచి కూడా ఈ రిఫైన్డ్ ఆయిల్స్ తయారు చేస్తారు. ఇవి కెమికల్ ట్రీట్‌మెంట్‌తో తయారవుతాయి. వీటిల్లోనూ ఎన్నో రకాలు. పేరేదైనా అంతా మార్కెటింగ్ మ్యాజిక్కే. దీని నుంచి శరీరానికి పోషకాలు అందే అవకాశాలు తక్కువే. దీంతో ప్రజలు మళ్లీ గానుగ నూనె వైపు మొగ్గుతున్నారు. కరోనా వచ్చాక సంప్రదాయ నూనెలు, రసాయన అవశేషాలు లేని ఆహార పదార్థాలపై జనం ఆసక్తి చూపిస్తున్నారు. గానుగ నూనె వంటకాలకు మళ్లీ ప్రాచుర్యం పెరిగింది. పూర్వపు తూర్పు గోదావరి జిల్లాలో కోల్డ్ ప్రెస్, రోటర్ వంటి యంత్రాలతో గానుగ నూనె తయారు చేసి, అమ్ముతున్నారు. రాజమహేంద్రవరంలో గానుగ పేరుతో ఏకంగా ఒక వీధి కూడా ఉంది. ప్రస్తుతం కిలో నువ్వుల నూనె కనీస ధర రూ.400 ఉంది. నువ్వులు లేదా వేరుశనగ కొని తీసుకువెళ్తే యంత్రాలపై మన ఎదురుగానే నూనె తయారు చేసి ఇస్తున్నారు.

వేపుళ్లకు వద్దు సుమా..

గతంలో ఉపయోగించిన గానుగ నూనెనే ఇప్పుడు కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ అంటున్నారు. అతి తక్కువ ఉష్ణోగ్రత వద్ద గింజల్ని ఒత్తిడికి గురి చేసి నూనె ఉత్పత్తి చేయడం వల్ల ఆ పేరు వచ్చింది. 49 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి పుట్టకుండా నూనె తీస్తారు. ఇందుకోసం ప్రత్యేకించి మెషీన్లు వచ్చేశాయి. గానుగ తరహాలోనే ఇందులోనూ చెక్కను వినియోగిస్తున్నారు. ఈ పద్ధతిలో పోషకాలు చెక్కు చెదరవు. రసాయనాల్ని ఏమాత్రం వాడరు. చక్కటి రుచి, వాసన కలిగి ఉంటుందీ నూనె. రిఫైన్డ్ ఆయిల్‌తో పోలిస్తే ధర ఎక్కువైనా జనం లెక్క చేయడం లేదు. ఆరోగ్యకరమైన కొవ్వు, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. విటమిన్-ఇ, ఒమెగా-3, ఒమెగా-6, ఫ్యాటీ యాసిడ్లు, బయోఫ్లేవనాయిడ్ల వంటివి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చర్మం, జుట్టు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఎక్కువ వేడి చేయకూడదు. వేపుడుకు వాడకపోవడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఎండ తగలని ప్రదేశంలో ముదురు రంగు గాజు సీసాల్లో భద్రపరచాలి. ఫ్రిడ్జ్‌లో మూడు నెలల వరకూ ఉంచుకుని వాడవచ్చు.

రిఫైన్డ్ ఆయిల్ వద్దు.. గానుగ నూనెలు ముద్దు



మా కుటుంబం 63 సంవత్సరాలుగా రాజమహేంద్రవరంలో గానుగ నూనెల తయారీ, విక్రయాలు చేస్తోంది. ఈ నూనెల్లో ఎక్కడ రసాయనాల పాత్ర ఉండదు. ఇవి ప్రకృతి సిద్ధమైనవి. వీటిలో ఎన్నో రకాల అత్యవసర కొవ్వు ఆమ్లాలు నిక్షిప్తమై ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయి. ఎన్నో పోషక విలువలు కలిగి ఉంటాయి. ఈ నూనెలు వాడటం వలన హెచ్‌డీఎల్ అనే మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చెందుతుంది. గుండె సంబంధ వ్యాధులు తగ్గడానికి ఇది ఉపయోగపడుతుంది. కరోనా మహమ్మారి తర్వాత ప్రజల్లో అవగాహన పెరిగింది. సహజసిద్ధమైన గానుగ నూనెల వాడకం పెరిగింది. రిఫైన్డ్ ఆయిల్స్ సహజసిద్ధమైనవి కావు. ఈ నూనెలను అత్యంత అధిక ఉష్ణోగ్రతల వద్ద కొన్ని పెట్రో కెమికల్స్ కలిపి, మరిగించి తయారు చేస్తారు. వీటిలో కొన్ని భార పదార్థాలు అంతర్లీనంగా కలిసి ఉంటాయి. వీటి వాడకం వల్ల ఎల్‌డీఎల్, వీఆర్‌డీఎల్ వంటి చెడు కొలెస్ట్రాల్ వృద్ధి చెందుతుంది. గుండె సంబంధ ఇబ్బందులకు ఇవి దారి తీస్తాయి. ఆరోగ్యం కోసం గానుగ నూనెల వాడకం మరింత పెరగాల్సి ఉంది.

– అంబటి శివప్రసాద్, అధినేత, శివప్రసాదం గానుగ నూనెల పరిశ్రమ, రాజమహేంద్రవరం

ఇక్కడి నుంచే నూనె తీసుకువెళతాం



మా సొంతూరు కాకినాడ సమీపంలోని నడకుదురు. హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో 14 ఏళ్లుగా టెక్నీషియన్‌గా పని చేస్తున్నాను. మా ఇంట్లో వంటలకు పూర్తిగా నువ్వుల నూనె మాత్రమే వాడతాం. మేం తీసుకునే ఆరోగ్య జాగ్రత్తల్లో ఇదొకటి. హైదరాబాద్‌లో కిలో రూ.600 పైమాటే. మా బంధువులందరూ కాకినాడ, రాజమహేంద్రవరం పరిసరాల్లో ఉంటారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు వచ్చినపుడల్లా 10 కిలోల చొప్పున పప్పునూనె కొని తీసుకు వెళుతుంటాను. ఇక్కడ రేటు ఇంచుమించు కిలో రూ.400.

– కోట రాజేష్, బీహెచ్ఈఎల్ ఉద్యోగి, హైదరాబాద్

తరతరాలుగా ఇదే వృత్తి



మా తాతముత్తాల నుంచి గానుగ వృత్తిపై ఆధారపడుతున్నాం. అప్పట్లో ఎద్దులతో గానుగ ఆడేవారు. తర్వాత పరిస్థితులకు అనుగుణంగా మేం కూడా మారాల్సి వచ్చింది. ఎద్దుతో గానుగ నిర్వహణ చాలా వ్యయంతో కూడుకున్నదిగా మారింది. పైగా ఎక్కువ సమయం పడుతుంది. అందుకే మా తరం వచ్చేసరికి మెషీన్లు కొనుక్కున్నాం. వృత్తిని మాత్రం కొనసాగిస్తున్నాం.

– పెండ్యాల కృష్ణ, రంగంపేట



ఇలాంటి గానుగ కనుమరుగు

టమాటా.. కాస్త ఊరట

- రెండంకెలకు దిగి వచ్చిన ధర
- కిలో రూ.60కే లభ్యం
- పెరిగిన విక్రయాలు

అమలాపురం టౌన్: అధిక ధరలతో ఆకాశాన్నంటి.. వినియోగదారులను విలవిలలాడించిన టమాటా.. ప్రస్తుతం సామాన్యులకు కాస్త అందుబాటులోకి వస్తోంది. కొన్ని నెలల పాటు కిలో టమాటా ధర మూడంకెల పైనే సాగింది. క్రమేపీ పెరుగుతూ కిలో రూ.200 వరకూ ఎగబాకి, వినియోగదారుల గుండెల్లో గుబులు పుట్టించింది. అంత ధరకు కొనలేక చాలామంది టమాటా వినియోగమే మానుకున్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర ప్రభుత్వం భారీ సబ్సిడీతో రైతుబజార్ల ద్వారా కిలో టమాటాను రూ.50కే అందించింది. భారీ ధరలతో దడ పుట్టించిన టమాటా ప్రస్తుతం నేలకు దిగి వస్తోంది. మొదటి రకం టమాటా ధర కిలో రూ.80 పలుకుతుండగా.. రెండో రకం రూ.60 పలుకుతోంది. క్రమేపీ ధర తగ్గుతూ రెండంకెలకు



రావడంతో టమాటాల విక్రయాలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఈ ధరలు మరింత దిగి వస్తాయని కూరగాయల వ్యాపారులు అంటున్నారు.

జిల్లాలోని కూరగాయల హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచే టమాటాలు దిగుమతి చేసుకుంటారు. చిత్తూరుతో పాటు తెలంగాణలోని రంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల్లో టమాటా దిగుబడి కొన్నాళ్లుగా పెరిగింది. దీంతో దీని మార్కెట్‌లో లభ్యత పెరిగి, ధరలు తగ్గుతున్నాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. టమాటా ధరలు సాధారణంగా ఉన్న సమయంలో జిల్లాకు రోజుకు దాదాపు 10 టన్నులు దిగుమతి అయ్యేవి. కిలో రూ.100 నుంచి రూ.200 వరకూ ధర పలికిన సమయంలో 2 టన్నుల దిగుమతి కూడా గగనంగా ఉండేది. జిల్లాలోని లంక గ్రామాల్లో పండే దేశవాళీ టమాటా ఏటా శీతాకాలంలో అంటే డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే లభ్యమవుతుంది. మిగిలిన సమయాల్లో మదనపల్లి మార్కెట్ నుంచే జిల్లాకు దిగుమతి చేసుకుంటారు.

వారం రోజుల్లో మరింత తగ్గుదల



టమాటా ధరలు వచ్చే వారం రోజుల్లో మరింతగా తగ్గుతాయి. కిలో రూ.45కు తగ్గే అవకాశం ఉంది. టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుబజార్లలో కిలో టమాటాను రాయితీపై రూ.50కే వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలోని మూడు రైతుబజార్ల ద్వారా 11 టన్నుల టమాటా సరఫరా చేశాం. ధరలు తగ్గుతున్న క్రమంలో రైతుబజార్లలో రాయితీపై టమాటా విక్రయాలు నిలిపివేశాం. టమాటా దిగుమతులు వారం రోజుల్లో మరింత సరళం కానున్నాయి.

– కె.విశాలాక్షి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

20 కిలోలు అమ్మడమే కష్టమయ్యేది



ధరలు సాధారణంగా ఉన్నప్పుడు 100 నుంచి 150 కిలోల టమాటాలు దిగుమతి చేసుకుని, వాటిని పూర్తిగా విక్రయించేవాళ్లం. అదే ధర అధికంగా పెరిగిన సమయంలో 25 నుంచి 30 కిలోల వరకూ మాత్రమే దిగుమతి చేసుకునే వాళ్లం. ఇందులో 20 కిలోలు అమ్మడం కూడా కష్టంగా ఉండేది.

– బద్రి రమణ, కూరగాయల వ్యాపారి, అంబాజీపేట

కిటకిటలాడిన బాలబాలాజీ ఆలయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు.. స్వామి వారికి తలనీలాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి, తమ కోర్కెలు నెరవేర్చాలని శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన స్వామి వారిని వేడుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.3.59 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.95 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.63,435 వచ్చాయన్నారు. 4,396 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 3,685 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

16 నుంచి విజయదుర్గా పీఠం వార్షికోత్సవాలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠం 51వ వార్షికోత్సవాలు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్ఓ వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ) శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ విషయం తెలిపారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) 1972లో పీఠం ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి ఏటా పీఠం వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 9.18 గంటలకు వార్షికోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, నవగ్రహ మండపారాధన, తమిళనాడు తిరుత్తణి ఆలయ అర్చకులతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి త్రిశతి హోమం నిర్వహిస్తారని వివరించారు. 16న కాణిపాకం వినాయకస్వామి దేవస్థానం తరఫున వేదపండితులతో శ్రీ మహాగణపతి విశేష పూజ, హోమం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం విజయదుర్గా ఉత్సవ మూర్తికి లక్ష గులాబీ అర్చన, ఖడ్గమాల పారాయణ జరుగుతాయన్నారు. 17వ తేదీ ఉదయం కపిలతీర్థం నుంచి వచ్చే వేద పండితుల ఆధ్వర్యాన శ్రీ కపిలేశ్వర స్వామి, అమ్మవార్ల విశేష కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు సాయంత్రం తిరుత్తణి వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం జరుగుతాయని వివరించారు. 18వ తేదీన వేద పండితుల ఆధ్వర్యాన శ్రీ సీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం, అదే రోజు సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం వైఖానస పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. 19వ తేదీన అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హోమం, పూర్ణాహుతితో వార్షికోత్సవాలు ముగుస్తాయన్నారు. సమావేశంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు భాస్కర నారాయణ, జి.సత్య వెంకట కామేశ్వరి, పి.సత్య కనకదుర్గ, బి.రమ తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను పీఠాధిపతి గాడ్ ఆవిష్కరించారు.



వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి గాడ్

వాడపల్లిలో మార్మోగిన గోవింద నామస్మరణ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లిలో శనివారం గోవింద నామస్మరణ మార్మోగింది. ఇక్కడ స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రం నలుమూలల నుంచీ తరలివచ్చిన సుమారు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి వివిధ పూజా కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయం, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.37,64,354 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయం వద్ద భక్తుల రద్దీ నేపథ్యంలో ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు నిర్వహించారు.



వాడపల్లి ఆలయంలో వెల్లువెత్తిన భక్తులు

తను కనుమరుగై..

- ఊపిరి పోస్తున్న అవయవ దానం
- చనిపోయిన వ్యక్తి అవయవాలతో మరికొందరికి కొత్త జీవితం
- ఆదుకుంటున్న దాతల బంధువుల ఔదార్యం
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

పదుగురికి ప్రాణదీపమై..

కాకినాడ రూరల్/మండపేట/రాయవరం: సాధారణంగా ఎవరైనా చనిపోతే ఆ వ్యక్తి మృతదేహాన్ని వారివారి ఆచార సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు చేస్తుంటారు. అయితే మనిషి మరణించినా తిరిగి మరొకరిలో బతకడం ఒక్క అవయవ దానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. చాలా మంది బతికుండగానే కీలక అవయవాలు చెడిపోయి నరకం చూస్తున్నారు. మృత్యువాత పడుతున్నారు. ఇటువంటి వారికి సంజీవని అవయవ దానం. తద్వారా పోగొట్టుకున్న తమ వారిని అవయవ దానం పొందిన వారిలో చూసుకోవచ్చు. నేటి ఆధునిక జీవనంలో చాలా మంది కిడ్నీ, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె తదితర అవయవాలు చెడిపోయినా.. వాటిని దాతల నుంచి పొంది పునరుజ్జీవం పొందుతున్నారు. అవయవ దానంతో మరొకరి జీవితాన్ని నిలబెట్టవచ్చు. మరో కుటుంబంలో సంతోషాన్ని నింపవచ్చు. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఏమేమి దానం చేయవచ్చంటే..

బతికి ఉండగా, సహజ మరణం, బ్రెయిన్ డెత్.. ఈ మూడు రకాలుగా అవయవ దానం చేయవచ్చు. ముందుకు వచ్చిన దాతలు.. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి, మెదడుకు రక్త సరఫరా నిలిచిపోయి, బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలు సేకరిస్తారు. ఒక మనిషి ఎనిమిది మందికి అవయవాలు దానం చేయవచ్చు. వీటిలో కళ్లు (కార్నియా), గుండె, కిడ్నీలు, లివర్ (కాలేయం), చర్మం, ఎముకలు, గుండెలోని వాల్వులు, పాంక్రియాస్ (క్లోమం), పేగులు, ఊపిరితిత్తులు (లంగ్స్) తదితర అవయవాలు దానం చేయవచ్చు.

జీవన్‌దాన్ ద్వారా..

జీవన్‌దాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం 2014లో ఆరంభించింది. రాష్ట్ర విభజన అనంతరం 2015 నుంచి విజయవాడ కేంద్రంగా ఈ సంస్థ పని చేస్తోంది. దీని ద్వారా బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలు సేకరిస్తారు. దాతలు తమ పేర్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీవన్‌దాన్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం ఆర్గాన్ డోనర్ కార్డు అందిస్తుంది. దాతలు ముందుగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో పాటు తమకు తెలిసిన వారందరికీ సమాచారం ఇవ్వాలి. దీనివలన ఆ వ్యక్తి చనిపోయాక అవయవ దానం చేసేందుకు వీలు కలుగుతుంది. దాతలతో పాటు అవయవాలు కావాల్సిన వారు కూడా జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలి. వారికి సీరియల్ నంబరు కేటాయిస్తారు. అవయవ దానం చేసే కేసులు వచ్చినప్పుడు సీరియల్ నంబర్ ప్రకారం అవకాశం ఇస్తారు.

నలుగురి జీవితాలకు వెలుగు



అవయవదానం చేసిన బిక్కిన శ్రీకాంత్ (ఫైల్)

అవయవ దానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు మండపేటకు చెందిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు బిక్కిన చక్రవర్తి, శ్రీభాను దంపతులు. వారి ఒక్కగానొక్క కుమారుడు, మండపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి మనవడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు మేనల్లుడు అయిన శ్రీకాంత్ (22) బీటెక్ చదివేవాడు. రెండేళ్ల కిందట తన పుట్టిన రోజు నాడు మోటార్ సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళుతూ హైదరాబాద్‌లో ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయమైంది. అతడిని బతికించుకునేందుకు నెల రోజుల పాటు కుటుంబ సభ్యులు సర్వశక్తులూ ఒడ్డారు. మెరుగైన వైద్యం చేయించినప్పటికీ శ్రీకాంత్‌కు బ్రెయిన్ డెడ్ అయ్యింది. విధిరాతను మార్చలేకపోయినా తమ బిడ్డను చిరంజీవిగా చూసుకోవాలనుకున్నారు అతడి కుటుంబ సభ్యులు. హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన జీవన్‌దాన్ ద్వారా శ్రీకాంత్ గుండె, లివర్, రెండు కిడ్నీలను నలుగురికి దానం చేసి ఆదర్శంగా నిలిచారు.

మా శ్రీకాంత్ సజీవంగానే ఉన్నాడు



శ్రీకాంత్ మరణం మా కుటుంబానికి తీరని లోటు. భౌతికంగా మా మధ్య లేకపోయినా అవయవ దానం ద్వారా మరో నలుగురికి జీవితాన్నిచ్చి ఈ భూమిపై సజీవంగానే ఉన్నాడు. అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

– డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, మాజీ ఎమ్మెల్యే, మండపేట

ప్రోత్సహిస్తున్నా..



అవయవ దానం ప్రాధాన్యంపై పాతికేళ్లుగా ప్రజలను చైతన్యపరుస్తున్నాను. ఇప్పటి వరకూ 40 సార్లు రక్తదానం చేశాను. ఎంతో మందితో రక్త, నేత్ర, అవయవ దానాలు చేయించాను. మరణానంతరం మా శరీరాలను వైద్య కళాశాలకు ఇచ్చేందుకు నేను, నా భార్య స్వచ్ఛందంగా అంగీకార పత్రం రాశాం. మరణానంతరం అవయవ దానం చేయాలని భావించే వారు నేరుగా 94 944 180 99 నంబరుకు సంప్రదించవచ్చు.

– వి.మెహర్ మధు, సామాజిక కార్యకర్త, రాజమహేంద్రవరం

కన్న కొడుకులకు మళ్లీ ఊపిరి పోసిన తల్లులు



కిడ్నీ దానం అనంతరం కుమారుడు సుబ్రహ్మణ్యంతో తల్లి గంగారత్నం

- రంగంపేట మండలం వెంకటాపురానికి చెందిన బోడెం సుబ్రహ్మణ్యం (24) కిడ్నీ సమస్యతో బాధ పడేవాడు. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి వచ్చేది. కన్న కొడుకు పరిస్థితి చూసి తల్లిదండ్రులు గంగారత్నం, కృష్ణ తల్లడిల్లిపోయేవారు. కాకినాడ మెడికవర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆదుకుంది. కిడ్నీ మార్పిడికి రూ.2.6 లక్షలు మంజూరు చేసింది. గంగారత్నం తన బిడ్డకు తానే ఒక కిడ్నీ దానం చేసి పునర్జన్మను ప్రసాదించింది. మే 13న కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. తన కుమారుడు ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడని గంగారత్నం చెప్పింది.
- పశ్చిమ గోదావరి జిల్లా కనకాయలంక గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాసరావు కిడ్నీ సమస్యతో బాధ పడేవాడు. చికిత్స పొందినా తగ్గలేదు. కిడ్నీ మార్పిడి తప్పదని వైద్యులు నిర్ధారించారు. కుమారుడిని రక్షించుకునేందుకు 55 ఏళ్ల వయస్సులో ఉన్న అతడి తల్లి వరలక్ష్మి కిడ్నీ దానం చేసేందుకు ముందుకు వచ్చింది. 'ప్రాణం పోసిన ఆరోగ్యశ్రీ' శీర్షికన జూన్ నెలలో 'సాక్షి' ప్రచురించిన కథనం చూసి.. కాకినాడలో మెడికవర్ ఆస్పత్రిని సంప్రదించింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శ్రీనివాసరావుకు జూలై నెలాఖరులో వైద్యులు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేసి, పునర్జన్మను ప్రసాదించారు.



కిడ్నీ దానం అనంతరం కుమారుడు సుబ్రహ్మణ్యంతో తల్లి గంగారత్నం

నలుగురికి పునర్జన్మ



జగ్గంపేటకు చెందిన మాతా లక్ష్మీ నారాయణ (19) తుని వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ ట్రస్ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెలలో బ్రెయిన్ డెడ్ అయ్యాడు. పుట్టెడు దుఃఖం దిగమింగుకుంటూనే.. అతడి కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులు దానం చేసేందుకు తల్లిదండ్రులు వెంకట సత్యవతి, వీరభద్రరావు జూలై 6న ముందుకు వచ్చారు. వీటిని వైద్యులు రాజమహేంద్రవరం, విశాఖపట్నం తరలించి నలుగురికి పునర్జన్మను ఇచ్చారు.

నా భార్య జీవించే ఉంది



అనుకోని పరిస్థితుల్లో 55 ఏళ్ల వయస్సులో నా భార్య వరలక్ష్మి బ్రెయిన్ హెమరేజ్ కారణంగా బ్రెయిన్ డెడ్ అయింది. ఆమె ఇక దక్కదని నాకు తెలుసు. ఆ పరిస్థితుల్లో నా భార్య అవయవాలు దానం చేస్తే మరొకరికి ప్రాణం పోసినట్లవుతుందని భావించాను. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చాను. నాకు ఆత్మసంతృప్తి కలిగింది.

– మద్దుల వీఆర్‌కే నాగభూషణం, రాజమహేంద్రవరం

ముందుకు రావాలి



అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. తద్వారా మరొకరికి కొత్త జీవితం ఇవ్వవచ్చు. ఎక్కువగా కిడ్నీ సంబంధిత సమస్యలతో చాలా మంది బాధ పడుతున్నారు. ఏటా 5 లక్షల మందికి పైగా అవయవాల వైఫల్యంతో మరణిస్తున్నారు. అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం పెరగాలి.

– డాక్టర్ కల్యాణ్‌బాబు, కిడ్నీ మార్పిడి వైద్యుడు, మెడికవర్ ఆస్పత్రి, కాకినాడ

ఎవ్వరైనా చేయవచ్చు



ఏ వయసు వారైనా అవయవ దానం చేయవచ్చు. అవగాహన ద్వారా చాలా మంది ముందుకు వస్తున్నారు. మరణాంతరం అవయవ దానం చేసేలా ప్రజలను ప్రేరేపించేందుకు ప్రపంచ అవయవ దాన దినోత్సవం జరుపుకొంటున్నాం.

– బాదం బాలకృష్ణ, చైర్మన్, డాక్టర్ బీవీ రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్

ఎందరికో పునర్జన్మ



అవయవ దానంతో ఎందరికో పునర్జన్మ ప్రసాదించవచ్చు. మనిషి బతికి ఉన్నా లేదా చనిపోయాక కూడా అవయవాలు దానం చేయవచ్చు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

– డాక్టర్ రామకృష్ణ, ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టర్

40 మందితో నేత్రదానం



ఇప్పటి వరకూ 40 మందితో నేత్రదానం చేయించాను. ఒకరి నేత్రదానం ఇద్దరికి చూపునిస్తుందనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు ప్రతి ఒక్కరూ పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. అవయవ దానంపై కూడా అవగాహన కల్పిస్తున్నాను.

– వెలగల ఫణికృష్ణారెడ్డి, సామాజిక కార్యకర్త, రాయవరం

క్లుప్తంగా

ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నిఖిల్



కాకర్ల వెంకటరామిరెడ్డితో వైస్ చైర్మన్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో శనివారం జరిగాయి. ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా కాకర్ల వెంకటరామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తనయుడు, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్‌కృష్ణను ఎన్నుకున్నారు. పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు నిఖిల్‌కృష్ణకు అభినందనలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భర్త అదృశ్యమయ్యాడని ఫిర్యాదు

అంబాజీపేట: భర్త అదృశ్యమయ్యాడంటూ పోలీసులకు ఓ భార్య శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. గంగలకుర్రు శివారు మెట్ల కాలనీకి చెందిన గోసంగి వెంకటస్వామి ఈ నెల 8వ తేదీన వ్యాన్ డ్రైవర్‌గా హైదరాబాద్ వెళ్లాడు. భార్య సీతకు 10వ తేదీన ఫోన్ చేసి, హైదరాబాద్ నుంచి రైలులో వస్తున్నానని చెప్పాడు. అదే రోజు రాత్రి బస్సులో గుంటూరు వెళ్లానని, తన వద్ద డబ్బులు లేవని, పంపమని చెప్పాడు. దీంతో వెంకటస్వామికి భార్య రూ.500 ఫోన్‌పే చేసింది. అప్పటి నుంచీ అతడి ఫోన్ పని చేయడం లేదు. దీంతో కంగారు పడిన సీత.. తన భర్త ఆచూకీ తెలియడం లేదంటూ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ కేహెచ్ ప్రసాద్ తెలిపారు.

వ్యాన్ ఢీకొని దివ్యాంగ బాలుడి మృతి

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం మినీ వ్యాన్ ఢీకొని దివ్యాంగ బాలుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని సంత మార్కెట్ వద్ద విలేజ్ మార్ట్‌కు డ్రింక్ కేసులు అన్‌లోడ్ చేసేందుకు మినీ వ్యాన్ వచ్చింది. అన్‌లోడ్ అనంతరం మినీ వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని వెనుకకు పోనిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన బాలుడు ఉంద్రాసపు లేమ్యూల్ సనీత్(9)ను ఢీకొంది. బాలుడి తలపై నుంచి వెనుక చక్రం పోవడంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి సూరిబాబు, తల్లి శ్యామల, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న తొండంగి ఏఎస్సై రాయవరపు వెంకటరమణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

న్యాయ వ్యవస్థలో ఎస్సీలకు ప్రాధాన్యం



ఎంపీ బోస్

రామచంద్రపురం: హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో షెడ్యూల్డ్ కులాల వారికి ప్రాధాన్యం పెంచాల్సిన ఆవశ్యకత ఉందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటులో జరిగిన చర్చ సందర్భంగా ఈ అంశాన్ని ప్రస్తావించానని తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సంబంధించి ఎస్సీ రిజర్వేషన్ల సవరణ బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొనే అవకాశం తనకు వచ్చిందన్నారు. ఆ సందర్భంగా రాజ్యసభలో ప్రస్తావించిన అంశాలను బోస్ వివరించారు.

'ఛత్తీస్‌గఢ్‌లోని ఆయా సామాజిక వర్గాల వారిని షెడ్యూల్డ్ కులాల్లో చేర్చడం వలన వివిధ డొమైన్లలో వారికి అనేక అవకాశాలు వస్తాయి. విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా అక్షరాస్యత పెరగడానికి, ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బడ్జెట్ కేటాయింపులతో బడుగు బలహీన వర్గాల వారి ఆర్థిక సాధికారతపై కేంద్రం నిబద్ధత చూపిస్తోంది. ప్రస్తుత సంవత్సరంలో బీసీ కాంపొనెంట్‌గా రూ.38,605 కోట్లు, ఎస్సీలకు రూ.20,005 కోట్లు, ఎస్టీ కాంపొనెంట్‌గా రూ.6,929 కోట్లు కేటాయించారు. ఈ నిధులు వారి సామాజిక, ఆర్థిక, అభివృద్ధికి సమర్థంగా ఉపయోగపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా సబ్‌ప్లాన్ ద్వారా ఎస్సీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.4,360 కోట్లు కేటాయించింది. సుప్రీంకోర్టు ఏర్పాటైనప్పటి నుంచి షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయమూర్తులు ఐదుగురు మాత్రమే ఉండటం విస్మయం కలిగిస్తోంది. ప్రస్తుతం 850 మంది హైకోర్టు న్యాయమూర్తుల్లో 24 మంది మాత్రమే షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారున్నారు. 14 కోర్టుల్లో ఎస్సీ న్యాయమూర్తులు లేకపోవడం చాలా దయనీయం. బీసీలు జడ్జిలుగా పనికి రారంటూ టీడీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఏకంగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయటం బాధాకరం. అర్హత కలిగిన వారందరూ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులయ్యేలా కేంద్ర ప్రభుత్వం విధివిధానాలు రూపొందించాలి' అని రాజ్యసభలో కోరానని ఎంపీ బోస్ వివరించారు.